రమణయ్య ఎవరు?
రుక్మిణమ్మ ఎవరు?
రామి ఎవరు?
కోటయ్య ఎవరు?
సుబ్బమ్మ ఎవరు?
శ్రీరాములు ఎవరు?

మొదటి ఇద్దరుమనుషులకీ, మిగతా నలుగురు మనుషులతో గల సంబంధం ఎటువంటిది?

అయితే, ఈప్రశ్నకి సమాధానం రమణయ్య దంపతుల దగ్గిర దొరకదు. వాళ్ళకీవిషయంగురించి ఆలోచించే అవసరమే ఉండదు. ఎందుకంటే మర్నాడు పనిమనిషి క్షమాపణ కోరుకుంటుంది; బంట్రోతు దయుంచమంటాడు; వంటావిడ బ్రతిమాలుకుంటుంది; చాకలి ప్రాధేయపడతాడు. అంతట అయ్యగారు, అమ్మగారు తమకోపాన్ని దయతో ఉపసంహరించుకోగలరు!

---

స్కెచ్

# 'బుర్ర' కథ

కె. రామలక్ష్మి

గంగాధరం చచ్చిపోయాడని విన్నరోజునే అనుకున్నాను-నా తలకీ ఒక ఎక్సరే తీయిద్దామని. కాని అవసరం వుండదన్నాడు వైద్యుడు.

"దీనిని గురించి ఎవరికీ యేమీ తెలియదు!" అన్నాడు వైద్యుడు. "మాకు తెలిసినంతమటుకూ, దేనికైనా రెండురకాల పెరుగుదల ఉంటుంది-ప్రమాదకరమైనదైవుండీ పైకి తెలియనిదీ, వుండీ ప్రమాదం లేకుండా దయచూపేదీ; వీట్లో ఏది ఎందుకువుందన్నా కారణం చెప్పలేం, అదేమీరు కనుక్కోగలగాలి" ఏమేమిటో చెప్పుకుపోతున్నాడు.

"నేనా? నే తెలుసుకోవాలంటారా?" అన్నా ఆశ్చర్యపోతూ.

"ఆఁ సరిగ్గా అదే అంటున్నాను. చాలామందికంటే బాగానే వూహించారు."

"బాగానే వుంది. కాని వుండుండి వచ్చే ఈ తలలో పోట్లు గురించి ఏమంటారు?"

"బాగుంది, కాని అప్పుడప్పుడు వచ్చే నా పోట్లు సంగతోమరి? చూశారూ! యిదేం ప్రకృతికి విరుద్ధంకాదు. మన బతుకులో ఒక భాగం. దాటిపోలేని ఒకభాగం!"

"నా బాధ వేరండీ. అందరికీ వుండొచ్చు. కాని, నా పోట్లు వేరు" అన్నాను గట్టిగానే.

"అబ్బాయ్,నువ్వు రచయితవనీ, కవిత్వం రాస్తావనీ నీకు ప్రత్యేకించి తల్లోపోట్లు వస్తున్నాయని అనుకోకు... పిచ్చికాని అందరూ క్షణక్షణం కొద్దికొద్దిగా చచ్చిపోతూనే వుంటారు. హాయిగా ఆందోళనా రహితంగా బతకాలంటే, యీ పోట్ల విషయం మరచిపో......" వేదాంతిలా తేల్చి చెప్పాడు వైద్యుడు.

"నిజంగానే అంటున్నారా?" అన్నాను. భయమేమిటి? అనుకుంటున్నా భయంతో శరీరం ఒణికింది.

"అలా భయపడతావేమిటోయ్? అది నిజం అని నీకూ తెలుసు. నాకంటెకూడా దృఢంగా తెలుసు. మనలో ప్రతివాడూ చావుకి క్షణం దూరంలోనే వుంటాడనుకో. మునిగిపోయేవాడికి ప్రాణవాయువు లేకుంటేనూ, ప్రమాదమైన పదార్థాన్ని అమాంతం ఢీకొంటేనూ... కొద్దిక్షణాల్లో కళ్లుమూసేస్తారు... యివన్నీ ప్రమాదాలనుకో... మామూలుగాకూడా మనిషి ఎప్పుడూ మృత్యువుకి నిముషం దూరంలోనే వుంటాడోయ్! వెర్రివాడా భయపడకు" వైద్యుడు ఓదార్పుస్వరంతో చెప్పాడు. తలలో పోట్లసంగతి యింక మరిచిపోవడానికే నిశ్చయించుకున్నాను.

అయినాకూడా గంగాధరం మరణం నన్ను బాధపెడుతూనే వుంది. ఈ సంవత్సరంలో ఎక్కువబాధ పెట్టింది అతని చావువార్త ఒక్కటే. చిన్నవాడు, పైకిరావలసినవాడు, హఠాత్తుగా కళ్లుమూసేసాడు. వెంకయ్యతాతతో అన్నాను-

"అవునోయ్, అలాగే వుండాలిమరి!" అన్నాడు వెంకయ్యతాత. డెబ్బయి ఏళ్ళు సునాయాసంగా తోసేసిన వెంకయ్యతాత, వయస్సులో చచ్చిపోవడమే బాగుంటుందని అంటూంటే ఏమిటి అనడం?

గంగాధరం చచ్చిపోయాడని మా మామకొడుకు చెప్తూంటే నమ్మలేకపోయాను. కాని మామకొడుకు వేళాకోళానికైనా ఇలాంటి వార్త చెప్తాడంటే నమ్మడం కష్టం. అందుకే గంగాధరం నిజంగానే చచ్చిపోయాడని నమ్మకతప్పిందికాదు. ఆచీకట్లలో నేనూ, మా మామకొడుకూ నడుస్తూంటే చెప్పాడు-గంగాధరం గురించి. జనసంచారం ఎక్కువగా లేనిరోడ్లు ఎంతో హాయిగా వున్నాయి.

"అతన్ని నువ్వు ఎరుగుదువా?" అడిగాడు మామకొడుకు.

"ఒకే ఒకసారి చూశాను. చాలాసేపు మాట్లాడుకున్నాం ఆ వేళ...చాలా సరదా అయినవాడు కాని, తలలో పోట్లుట. ఏ డాక్టరూ కుదర్చలేకపోయాడు కాబోలు!"... నడుస్తూనే నా కళ్లు ఆ చీకట్లో అన్నిటినీ పరిశీలించి చూస్తున్నాయి. ప్రతిదీ అలా ఎందుకుందో అని వింత వింత ప్రశ్నలు వేస్తూంది మనస్సు. అసలు ఎలా వుండాలి? ఆలోచిస్తూంది బుర్ర...ఎలావుందో చూడాలని తలపోసిన మహాపురుషులు తపస్సు చేశారు, ఎలావుందో యీ ప్రకృతి అని ఆలోచించిన చిత్రకారులు తమ కుంచెలకి పనికల్పించారు. వీళ్ళే మళ్ళీ ఎలావుండాలో కూడా ఆలోచిస్తూనూ వున్నారు. చిత్రిస్తూనూవున్నారు. ...ప్రాణంలేని వస్తువులూ, ప్రకృతీ... ప్రపంచం వున్నంతకాలం మనుషులు అభిమానం చూపిన చూపుకందని అనేకప్రాణులూ..ఏవేవో బుర్రలో పయనిస్తున్నాయి.

రాత్రి యింటికివచ్చి పడుకున్నానన్నమాటే కాని నిద్రరాలేదు. గంగాధరం మృత్యువార్త లేపిన దుమారం తగ్గలేదు. ఆ కటికచీకట్లోకూడా కళ్లు పొడుచుకొని దేనికోసమో చూస్తున్నాను; కిటికీ లోంచి కనిపించే చీకటీ, ఆకాశం-ఉదయంకోసం-కాంతికోసం ఆత్రం!-ఈ ప్రపంచం తిరిగి సూర్య కాంతితో నిండడంకోసం,......అంతా ఎదురు చూడ్డమే... మనమే చేసుకొన్న ఈ ప్రపంచం-అసహ్యంగానూ, అందంగానుకూడా యీ భూమి మీద మనమే సృజించుకొన్న ఈ చిన్నప్రపంచం-ఎలా వుండాలి? ఎలావుంటే బాగుంటుంది? ఎలా వుంటే నిండు ప్రాణికి హాయి? జీవితంపై కోర్కె? ఆ చీకట్లో... యీ ప్రపంచం ఎలావుందో చూడగలిగాను. ఎలాగుందో ఎలా చెప్పను? నా అనుభవాలేమీ అనుభవాలూను. మీ అనుభవానే ఈ లోకపు ప్రతివ్యక్తి అనుభవాలూ. అందుకే ఎలా చెప్పను? ఎందుకు చెప్పడం?...ఏం చెప్పాలన్నా మొట్టమొదటికి వెళ్ళాలికదా? లేకుంటే కథ పూర్తిగా ఎలా తెలుస్తుంది? ప్రతిదానికీ మొదలు మనం ప్రారంభించినప్పుడే-అందరూ అనుకొనే పుట్టుకయే మొదలంటే అర్థంలేదు. దానికీ మనిషి జీవితం మొదలెట్టడానికీ సంబంధం ఏమిటి? జీవితానికి మొదలు నీ అంతట నువ్వు 'చూచి'నప్పుడూ ప్రప్రథమంగా ఏదైనా 'చూడగలిగి'నప్పుడూను. కలలా సాగిపోయే జీవితంలోంచి మేల్కొంచి, ఈజీవితపు అసహాయతా, బతికున్నామనే భయంకరమైన నిజం తెలుసుకోడమూ, ఒక వ్యక్తివనీ సుఖదుఃఖాలకి పాత్రుడవనీ-తెలుసుకున్నప్పుడు?

జీవితానికి ఆరంభం: మనుష్యుల బాహ్యాకారాలకీ అంతఃస్వభావాలకీ తేడా తెలుసుకున్నప్పుడే కదూ? వాళ్లూ యీ ప్రపంచంలో చూసిపోడానికి కాలాన్ని అప్పు తీసుకొని వచ్చిన వ్యక్తులేననీ వచ్చిపోతూ వుంటారనీ తెలుసుకున్నప్పుడు... దేనికీ వాళ్లూ సొంతగాళ్లు కాదు. ఆ నియమిత కాలంపాటు అంతా అనుభవిస్తారు. కాని చివర దాకా, అంటే డెబ్బయి-ఎనభై-తొంభై నిండే దాకా చావుని ఆహ్వానిస్తూ చివరికి చనిపోయే వాళ్లు, చిన్నపిల్లల్లా నిస్సహాయంగా జీవితం ముగిస్తారు. కాని, అసలు మనుష్యులు... చావుకి ఎప్పుడూ క్షణం దూరంలో ఉంటారు. పొరుగువాడి దృష్టిలో ఘనుడైనా, అల్పుడైనా-దైవం దృష్టిలో ఉత్తముడైనా పతితుడైనా మనుష్యులందరూ తుది క్షణంలో... యీ ప్రపంచంలోకి ఎలా వచ్చారో అలాగే వెళ్ళిపోతారు... ఈ లోకంలోకి వచ్చిన క్షణమూ తిరిగి వెళ్ళిపోయే క్షణమూ కూడా... అద్భుత విషయాలలాగే అర్థం అవవు... రావడము ఎంత సునాయాసమో, పోవడం అంత ప్రమాదంగా ఎంచే వాళ్ళూ వున్నారు. రాకపోకలు ఒకేలా ఎంచే

వాళ్ళూ వుంటారు. కాని అందరికీ తుదిక్షణం ఒకలాగే వుంటుందేమో? (అనుభవంలో!)

ఈ జీవితంలో కష్టసుఖాలు ఒక్కలాగే గడుస్తాయి-కాని కాలం ఆగిపోయి హృదయం ఉప్పొంగితేనూ, మానవత్వం ఆధ్యాత్మిక శిఖరాలని అందుకొంటేనూ, యీ కష్టాసుఖాలకి తేడా తెలియదు: అంతులేని అన్వేషణలో - చివరికి సత్యాన్ని కనిపెట్టినంత ఆనందం పొందుతాడు కష్టసుఖాలు లెక్కించనివాడు. ఈ జీవితంలో ఇవి యిలా వుంటుందనీ, అంతా యిలాగే వుంటుందనీ ఎవరమూ చెప్పలేంకదా!

తెల్లవారిపోతోంది. గంగాధరం చావుకబురు లేపిన 'బుర్ర'కథ సంపూర్ణం కాలేదు....ఇంతలోకే మా మామకొడుకు లేచి స్నానాదులు ముగించాడు కాబోలు! నాకోసం వస్తున్నాడు.

"నిద్దర రాలేదా, కళ్లు ఎర్రగా వున్నాయి?" వస్తూనే ప్రశ్నించాడు. ఏమిటి సమాధానం?

"గంగాధరం ఎందుకు చచ్చిపోయాడో?" అప్రయత్నంగానే వచ్చేసింది ఆ మాట.

"మెదడులో రక్తం పోటు హెచ్చి. దీల్లో వింతేముంది? అతి తాగుడు. అవన్నీ చెప్పనివ్వలేదు నువ్వు."

"తాగితే ఎలా వుంటుంది?"

"ఎలావుంటుందో నాకు తెలుసు. కాని, ఎలా చెప్పడం ఎలావుంటుందో?" అన్నాడు.

అవును. ఎలాగచెప్పడం-ఇది యిలా వుంటుందని? ఆ శక్తిలేదు మానవమాత్రులకి. ఇది యిలా వుంటుందనీ, ఇలావుంటే మానవుడికి తృప్తి అనీ తెలుసుకోకలిగియున్నాడా- మానవుడు మానవుడే కాదేమో!

ఇంటికిపోదామని బయలుదేరాను. దారిలో బాధతో హృదయం మూలిగింది. ఈహృదయానికి వచ్చిన కష్టం ఏమిటి? రక్తపుపోటు తనకిలేదే! మరిదేనికీ బాధ? పాతకాలం గడిచిపోయిందనా? వర్తమానం జరుగడుతోందనా? కాదే. గత కాలపు మహాపురుషులు యిక లేరనీ రారనీనా? గంగాధరం చనిపోయాడనా? మరెందుకు? ప్రశ్నకి అందదు సమాధానం. ఈ ప్రపంచంలో ఏమిటి కొరవ?—మనశ్శాంతికి మందు కొనుక్కోవాలి. వ్యక్తిత్వపు వికాసానికి చేయూత యివ్వాలి అప్పుడే జీవిత పరమావధి. "కాని యీ ప్రపంచం యిప్పుడున్నట్లుగావుంటే లాభం లేదు. నాకు నేనే సహాయం చేసుకోలేను" మూల్గుతుంది అంతరాత్మ. "మరెలా వుండాలంటావ్? అది చెప్పకూడదూ?" ఎదురుప్రశ్న వేస్తుంది మెదడు. అవును- ఉన్నదానిలో లోపాలు తెలిశాయికాని కావలసినదేమిటో చెప్పలేకపోతే ఎలా? ఎవరుమటుకు ఏంచెయ్యగలుగుతారు?

...ఊహలు సాగుతునే వున్నాయి కాని వైద్యుడు గుర్తుకొచ్చాడు...క్షణక్షణం కొద్దికొద్దిగా చచ్చిపోతూనే వుంటారు. "..మరి నా తలపోటు సంగతి? ఎలాగ? దానికి నివృత్తిలేదా" లేకేం? ఎందుకుండదూ? ఎటొచ్చీ నువ్వు దాన్ని తెలుసుకోకలగాలి." నన్ను నేనే సమాధానించుకొనే తరుణంలో...కుడివైపునతలలో పెద్దపోటు వచ్చింది. హృదయం భారంగా మూలిగింది.

## కవి : రవి

తన బాధలను గాథలుగా, గీతాలుగా మార్చి, పాడుతాడు కవి!
తన తనువు కాల్చి మనకు వేడిమినీ, వెలుగునూ ప్రసాదిస్తాడు రవి!
ఇక్కడా, అక్కడా అనకుండా అన్నిచోట్లా తన జ్యోతిఃకిరణాలు ప్రసరిస్తాడు రవి!
వాడూ, వీడూ అనకుండా అందరి హృదుల్లోనూ తన గీతీచరణాలు పలికించి ఆనందాన్నందిస్తాడు కవి!
జగచ్ఛక్షువు, జగద్బంధువు, ప్రత్యక్షభగవానుడు నభోరవి
ప్రజాప్రతినిధి, ప్రజాబంధువు, సంపూర్ణమానవుడు మహాకవి!

—శంకరగంటి రంగాచార్యులు.